క్లుప్తంగా

సురక్షిత నీటిని సరఫరా చేయండి



మంచినీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఈఓ భీమేశ్వరరావు

ఉంగుటూరు: ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని జెడ్పీ సీఈఓ భీమేశ్వర రావు అన్నారు. బుధవారం ఆయన ఉంగుటూరు మంచినీటి ప్రాజెక్టును సందర్శించారు. ఈ ప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. డెల్టా గ్రామాల ప్రజలకు మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. నాచుగుంట వాటర్ ప్రాజెక్టులో సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడున్న సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్కు ఇన్స్పెక్టర్ జానీ, ఎంపీడీఓ రాజ్ మనోజు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు

దెందులూరు: రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై జ్యుడీషియల్ విచారణ చేయించాలని పాస్టర్ అసోసియేషన్ దెందులూరు మండల గౌరవ అధ్యక్షుడు విలియం, అధ్యక్షుడు డేనియల్ డిమాండ్ చేశారు. బుధవారం కొవ్వలి కార్యాలయంలో నిర్వహించిన మండల పాస్టర్ అసోసియేషన్ కార్యవర్గం సమావేశంలో వారు మాట్లాడారు. ఆధ్యాత్మికాభివృద్ధికి కృషి చేస్తున్న సువార్తికులు ప్రవీణ్ ఆకస్మిక మృతి తమను కలిసి వేసిందన్నారు. ఆయన మృతి వెనుక వాస్తవాలు విచారణతోనే బహిర్గతమవుతాయని తెలిపారు. తొలుత ప్రవీణ్ మృతి పట్ల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌనం పాటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రతన్ ప్రసాద్, మోషే, రాకేష్, బెంజిమెన్ ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ



వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు : వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం పాలవుతారని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం పోతునూరు పీహెచ్‌సీ గ్రామంలో పలు ప్రధాన వీధుల్లో ఎంపీహెచ్‌ఓ హరి, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సబ్ సెంటర్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక




మావూరి జ్ఞానశౌర్య   హెచ్ రీతుబాంధవి

భీమడోలు: మండలంలోని ఇద్దరు విద్యార్థులు నవోదయలో ప్రవేశానికి అర్హత సాధించారు. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో సూరప్పగూడెం పంచాయతీ పరిధి పాతూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి మావూరి జ్ఞానశౌర్య, భీమడోలులోని ఓ పాఠశాల విద్యార్థిని హెచ్ రీతుబాంధవి ఎంపికయ్యారని ఎంఈఓ 1 ఈదుపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వారికి తగిన శిక్షణ ఇచ్చి న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులను ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, హెచ్ఎం నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్, ప్రిన్సిపాల్ జి.రవి కుమార్, భీమడోలు గ్రంథాలయం పాఠకురాలు రీతూ బాంధవిని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

30న గోవాడ అంకమ్మ జాతర

దెందులూరు: కొవ్వలి గ్రామ దేవత గోవాడ అంకమ్మ జాతర మహోత్సవం ఈ నెల 30న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోవాడ నాగరాజు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉగాది రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు, జాతర కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కొవ్వలి గ్రామంతో పాటు శివారు గ్రామాల ప్రజలందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఆరోగ్యంగా చల్లగా చూడాలని అంకమ్మవారిన్ని వేడుకుంటామని చెప్పారు. ఏప్రిల్ 2న వేలాది మందికి ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటుచేస్తామని జాతర ఉత్సవ కమిటీ సెక్రటరీ గోవాడ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ శీలం అప్పారావు, క్యాషియర్ గుల్లపూడి రమేష్, సభ్యులు గోవాటి దుర్గారావు గోవాడ సాంబ, కొల్లూరు సాయి తెలిపారు.

పవిత్ర స్థలం హోలీల్యాండ్

తపస్సు కాలంలో సందర్శిస్తున్న విశ్వాసులు

పెదవేగి : మండలంలోని పినకడిమి గ్రామంలో ఫాదర్ సిల్వియో పాస్కలీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోలీల్యాండ్‌లో క్రీస్తు జన్మస్థలం, ఆయన పరిచర్య, సేవలు, మరణం తదితర గట్టాలను యెరూషలేమును ఆధారంగా తీసుకుని నిర్మించారు. ఈ కట్టడాలను ప్రస్తుత 40 రోజుల తపస్సు కాలంలో విశ్వాసులు భక్తిశ్రద్ధలతో సందర్శిస్తున్నారు. బుధవారం గుంటూరు జేఎంజే కాలేజీ విద్యార్థినులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని మేలును, ఆశీస్సులను పొందారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా వారి మనోభావాలను తెలియజేశారు.



నావలో నుంచి ఆపదలో పేతురు ఏసును పిలుస్తున్న దృశ్యాన్ని విద్యార్థినులకు వివరిస్తున్న ఫాదర్




పవిత్ర భూమిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ మాలధారులు

సంతోషంగా ఉంది



మా కళాశాల యాజమాన్యం హోలీల్యాండ్ సందర్శనార్థం తీసుకొచ్చారు. ఇక్కడ బైబిల్‌లో ఉన్న అనేక ఘటనలను కళ్లకు కట్టినట్లు నిర్మించారు. ఏసుప్రభువును శిలువ వేయుట చూపించే నమూనా, సియోను కొండ, ఆపద సమయంలో నావలో నుంచి ఏసును పేతురు పిలుస్తున్న దృశ్యాలు ఆలోచింపజేశాయి. బైబిల్‌లో చదివిన విషయాలను నేరుగా చూశాం.

– టి.రేష్మశ్రీ, విద్యార్థిని

మళ్లీ మళ్లీ చూడాలని ఉంది



హోలీల్యాండ్‌లోని ప్రతి ఘటం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. తమను ఇలాంటి పవిత్ర స్థలాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు ఇక్కడ బాగా నచ్చిన ప్రదేశం జెకర్య చెట్టుపై నుంచి ఏసును చూసే సన్నివేశం. హోలీల్యాండ్‌లోని ప్రతి నమూనాకు తగిన విద్యుత్ అలంకరణ చేయడంతో రాత్రి సమయంలో తేజోవంతంగా ఉంది. మళ్లీ మళ్లీ చూడాలని ఉంది.

– కె.స్వాతి, విద్యార్థిని

జెరుసలేం చూసినట్టే ఉంది



పినకడిమి గ్రామంలో కట్టిన ఇలాంటి కట్టడాలను ఎక్కడా చూడలేదు. పరిశుద్ధ బైబిల్ గ్రంథంలోని ప్రతి సన్నివేశాన్ని చాలా చక్కగా నిర్మించారు. ప్రతి ఘట్టం జెరుసలేంలో ఉన్నట్టే ఉన్నాయి. ఈ పవిత్ర భూమికి రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ ప్రాంతంలోని కట్టడాలని చూసిన వెంటనే మళ్లీ మళ్లీ రావాలని ఉంది.

– కె.జ్యోతి, విద్యార్థిని

బాల్య వివాహాలను అరికడదాం



పోలసానిపల్లిలో బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న మహిళా ఉపాధ్యాయులు

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో తల్లిదండ్రులను అవగాహన కలిగించాలని పూళ్ల వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. భీమడోలులో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ అరుణజ్యోతి మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణలో గ్రామస్థాయి నిరోధక కమిటీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక శరీరక, మానసిక రుగ్మతలకు గురై తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడతారని చెప్పారు. సూపర్ వైజర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. టీచర్ ఏడీవీ జ్యోతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో విద్య, ఆరోగ్యానికి దూరమవుతారని తెలిపారు. కార్యక్రమంలో వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

ఉంగుటూరు: నేడు, రేపు చంద్రన్న స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని ఎంపీడీఓ రాజ్‌మనోజు తెలిపారు. మొత్తం 127 యూనిట్లకు 804 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 27న ఎ.గోకవరం, బాదంపూడి, ఉప్పాకపాడు, బొమ్మిడి, చేబ్రోలు, నారాయణపురం, అప్పారావుపేట, దొంతవరం, గోపినాథపట్నం, కాగుపాడు, కైకరం గ్రామాలవారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 28న కాకర్లమూడి, వీఏపురం నల్లమాడు, గోపాలపురం, గొల్లగూడెం, రామచంద్రపురం, యర్రమిల్లిపాడు, రాచూరు, శీతారామపురం, రావులపర్రు, తల్లాపురం, ఉంగుటూరు నాచుగుంట, నీలాద్రిపురం, వెల్లమిల్లి గ్రామాల అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తామని చెప్పారు.

టీఏఆర్‌ఎల్‌ఎం లైన్ టెస్ట్ తనిఖీ



టీఏఆర్‌ఎల్‌ఎం లైన్ టెస్ట్ రాసిన విద్యార్థితో ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: కొత్తగూడెం, మసీదుపాడు పాఠశాలల్లో మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులకు బుధవారం నిర్వహించిన టీఏఆర్‌ఎల్‌ఎం లైన్ టెస్ట్‌ను ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ తనిఖీ చేశారు. గురువారం కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు టెస్ట్‌కు సంబంధించి పలు అంశాలు వివరించారు. టూల్ కిట్స్ అందజేశారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయం ఆదేశాల మేరకు ఆయన ఈ తనిఖీలు నిర్వహించారు. సమగ్ర శిక్ష కార్యాలయం సూచనలు పాటించి విజయవంతంగా పరీక్షలు పూర్తి చేయాలని ఎంఈఓ సూచించారు.

ఎల్ఈడీ లైట్లు, లౌడ్ హారన్ల తొలగింపు



ఆటో ఎల్ఈడీ లైట్లను తొలగిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఆదేశాల మేరకు వాహన తనిఖీ అధికారులు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 45కు పైగా ఆటోలు, తేలికపాటి సరుకు రవాణా వాహనాలకు అమర్చిన ఎల్ఈడీ లైట్లు, లౌడ్ హారన్లు, లౌడ్ స్పీకర్ల కనెక్షన్లను తొలగించారు. ఈ తనిఖీల్లో వాహన తనిఖీ అధికారులు పి.రమేష్ బాబు, ఎస్ జగదీష్ బాబు పాల్గొన్నారు. ఆటోలు, ఇతర వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు, లౌడ్ హారన్లు, లౌడ్ స్పీకర్లను తొలగించక పోతే కేసులు నమోదు చేస్తామని డీటీసీ కరీమ్ హెచ్చరించారు. గత రెండు వారాలలో 165 వాహనాల నుంచి అదనపు లైట్లు, లౌడ్ హారన్లను తొలగించినట్లు చెప్పారు. ఎల్ఈడీ లైట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనచోదకులకు ఇబ్బంది ఏర్పడుతుందని, లౌడ్ స్పీకర్ల నుంచి వెలువడే అధిక ధ్వని ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేస్తాయని డీటీసీ వివరించారు. రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై ధర్నా



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలూరు (టూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. గత పది రోజులుగా ప్రజా చైతన్య యాత్ర పేరుతో నగరంలో వివిధ ప్రాంతాలు కమిటీ పర్యటించింది. ప్రజా సమస్యలను పరిశీలిచింది. ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న దాదాపు 6000 టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారుల కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులయిన వారందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్‌లు అందజేయాలని కోరారు. జూట్ మిల్లులు మూతపడి ఉపాధి అవకాశాలు లేవని, అర్హులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. సుందరయ్య కాలనీ, కుమ్మరి రేవులలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో గోదావరి జలాలు సరఫరా చేయాలని కోరారు. కుమ్మరి రేవు ఏటిగట్టు ప్రాంతానికి డ్రిల్ బోర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా 50 ఏళ్ల నిండిన ఎస్సీ, బీసీలకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. తంగెళ్లమూడి ప్రాంతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎస్టీపీ ప్లాంట్లను వినియోగంలోకి తేవాలని కోరారు. ధర్నాలో నాయకులు వైఎస్ కనకారావు, కె.రామాంజనేయులు, వీవీఎన్ ప్రసాద్, గొట్టాపు రవికిషోర్,కంది విశ్వనాథం, ఎం.ఇసాక్, బి.సోమయ్య, జై.గోపి, కె.విజయలక్ష్మి, జి.ఏసుబాబు, మీసాల సత్యనారాయణ, ఎస్ సత్యనారాయణ, గనిగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.16,14,380



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంట రాట్నాలమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం 108 రోజులకు రూ.16,14,380 లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు. ఏలూరు ఆలయాల ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులు, గ్రామపెద్దలు బుధవారం ఆలయ ముఖ మండపంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

సకాలంలో ఇద్దరే హాజరు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్‌లో బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు అందరికీ అజెండా కాపీ పంపించారు. అయితే సమయం 11 గంటలు కావస్తున్నా ఇద్దరు మహిళా కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. సమావేశం గంటల ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైంది. అధికారులు మాత్రం 10.30 గంటలకే వచ్చి ఉన్నారు.

చురుగ్గా ఆలయ నిర్మాణం

దెందులూరు: పోతునూరు గ్రామంలో గౌరీ శంకరుల ఆలయ పునర్నిర్మాణం వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు.

పాము కాటుతో మహిళ మృతి

ఏలూరు టౌన్: మొక్కజొన్న పొత్తుల విరిచే పనికి వెళ్లిన మహిళ పాము కాటుకు గురైంది. హాస్పిటల్‌కు తరలించేలోపు మృతి చెందింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన ఉప్పలూరి లక్ష్మి (48) భర్త నగేష్, ము గ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో కండ్రికగూడెంలో మొక్కజొన్న పొత్తులను విరిచే పనికి వెళ్లింది. పనిలో ఉండగా పాము కాటు వేయటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే సహచర కూలీలు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. హాస్పిటల్ అత్యవసర వైద్యసేవల విభాగంలో వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేశారు.

యువతి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు సబ్బవరపు వారివీధికి చెందిన ఒక యువతి (19) అదృశ్యమైంది. పదో తరగతిన యువతి ఈనెల 24న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగ లబ్ధిదారుల్లో టెన్షన్



భీమడోలు సీహెచ్‌సీకి వచ్చిన పింఛనుదారులు



తన భార్య శ్రీదేవిని ఎత్తుకుని తీసుకొస్తున్న జగన్

- కొనసాగుతున్న పింఛన్ల పునఃపరిశీలన
- సీహెచ్‌సీకి వచ్చేందుకు ఇబ్బందులు

భీమడోలు: పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. తమ పింఛన్లు ఎక్కడ తొలగిస్తారోనని లబ్ధిదారులతో టెన్షన్ మొదలైంది. రూ.6 వేలు అందుకుంటున్న ఎముకల సంబంధిత దివ్యాంగ లబ్ధిదారుల వైకల్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం సంబంధిత వైద్యులతో పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపట్టింది. సదరం ధ్రువీకరణ పత్రాలు సరైనవోకావో పరిశీలిస్తున్నారు. భీమడోలు మండల వ్యాప్తంగా 1,180 మంది దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్నారు. భీమడోలు, గుండుగొలను, కోడూరుపాడు, దుద్దేపూడి సచివాలయాల పరిధిలోని 123 మంది దివ్యాంగులకు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని సచివాలయాల ఉద్యోగుల నుంచి సమాచారం పంపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలను ఓర్చి వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరిలో కొందరు పుట్టుకతో పోలియో కారణంగా మంచానికే పరిమితమయ్యారు. వీరిని ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు కుటుంబీకులు ఇబ్బందులు పడ్డారు. బాధితుల వద్దకే వైద్యులు వస్తే ఇబ్బందులు ఉండవని వారు పేర్కొంటున్నారు. ఎండల వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షల కోసం గంటల కొద్దీ లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. వీరికి మంచినీటి మినహా ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కూడా ఆసుపత్రి వద్ద దివ్యాంగులకు పరీక్షలు చేస్తారని, మండలంలోని ప్రతి దివ్యాంగ పింఛన్‌దారులకూ పరీక్షలు చేస్తారని అధికారులు తెలిపారు. పరీక్షల తర్వాత నివేదికలను డీఎంహెచ్‌ఓవోలకు అందజేస్తారని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు.

క్షయపై అవగాహన అవసరం



క్షయపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఎం నాగేశ్వరరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీలో బుధవారం జాతీయ ఎయిడ్స్, టీబీ నియంత్రణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంచార వాహనం వద్ద పలు రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధి విస్తరణ, నిర్ధారణ వంటి అంశాలపై క్షేత్ర సహాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలను వివరించారు. వైద్యులు సూచించిన మందులనే వాడాలన్నారు. ఈ మేరకు తొలుత కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి, సూపర్‌వైజర్లు కిషోర్, శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీషా, కౌన్సలర్ సురేష్, హనుమంతు, ఫీల్డ్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి



కట్టా ఏసుబాబు

దెందులూరు: విజయవాడ వరద బాధితులకు అందించాల్సిన లక్షలాది రూపాయల బియ్యాన్ని గోపాలపురం నియోజకవర్గం జనసేన నేత సువర్ణరాజు కైంకర్యం చేయటం దుర్మార్గమని, వెంటనే ఉప ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరులో ఆయన మాట్లాడారు. వరద బాధితుబాధితుల సాయాన్ని దోచుకోవడం సిగ్గుచేటన్నారు. బాధితులకు నాయం చేయాలని కోరారు.

డబ్బులు లాక్కొన్న వ్యక్తుల అరెస్ట్

భీమడోలు: ఓ వ్యక్తిపై దాడి చేసి డబ్బులు లాక్కొన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈనెల 23వ తేదీ రాత్రి భీమడోలు జంక్షన్‌లోని ఓ మెడికల్ షాపు వద్ద నిలబడి ఉన్న పోలసానిపల్లి గ్రామానికి చెందిన కోట చరణ్ అనే వ్యక్తిపై భీమడోలుకు చెందిన మద్దా కల్యాణ్, గిరిజాల సాంబశివ, జాన్‌బాబు అనే ముగ్గురు వ్యక్తులు దాడి చేసి రూ.2 వేల నగదును లాక్కొని వెళ్లిపోయారు. బాధితుడు చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేశారు. మద్దా కల్యాణ్, గిరిజాల సాంబశివలను అరెస్ట్ చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. జాన్‌బాబు పరారీ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మద్దా కల్యాణ్, జాన్ బాబులపై గంజాయి కేసులున్నాయి.

కూలీలకు ఉపాధి కరువు

భీమడోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ భీమడోలులో బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనులు కల్పిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అమలుకావడంలేదని పేర్కొన్నారు. మండలంలో అరకొరగా పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భీమడోలు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేరన్న సాకుతో పనులు కల్పించడం లేదని, మండల అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో దళితులు అధిక సంఖ్యలో ఉన్నారని, వీరు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భీమడోలు గ్రామంలో పనులు కల్పించాలని ఆయన అధికారులను కోరారు.

10లోపు రీసర్వే పూర్తి చేయాలి



రీసర్వే టీమ్‌తో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి

దెందులూరు: మలకచర్లలో రీసర్వేను ఏప్రిల్ 10వ తేదీలోపు పూర్తి చేయాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. బుధవారం మలకచర్లలో రీసర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆరు టీములు రీ సర్వేలో పాల్గొన్నారు.

మోటారు స్టాటర్ అపహరణ

పెదవేగి : మండలంలోని ముండూరు గ్రామానికి చెందిన బలుసు శ్రీనివాసచౌదరి పొలంలో ఉన్న బోరు మోటారు స్టాటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. స్టాటర్ విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ఉప సర్పంచ్ ఎన్నిక

దెందులూరు: స్థానిక ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయం-2లో నిర్వహించనున్నట్టు గ్రామ కార్యదర్శి స్టానిష్ బాబు తెలిపారు. ఈ ఎన్నికకు గ్రామ పంచాయతీలో ఉన్న 16 మంది వార్డు సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.